# అక్రమాలే సక్రమాలు..

- “ సామాన్యులకే చట్టాలు...అక్రమార్కులకు చుట్టాలు..”
- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- దుండిగల్‌లో బల్దియా మౌనం వెనుక ముడుపుల మర్మమా
- జీ+2 అనుమతులు జీ+4,5 నిర్మాణాలు













**వార్త పత్రిక కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7:**
దుండిగల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతుండటం జిహెచ్ఎంసి పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. చట్టాలు అమలు కావాల్సిన ప్రాంతం అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. సామాన్య ప్రజల భద్రత, నగర ప్రణాళిక, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలు పూర్తిగా గాలికొదిలి, అక్రమ నిర్మాణాలకు మాత్రం అడ్డుకట్ట లేకుండా సాగుతున్న పరిస్థితి దుండిగల్ సర్కిల్‌లో కనిపిస్తోంది.

## జీ+2 పర్మిషన్లు... అంతస్తులపై అంతస్తుల నిర్మాణాలు

టౌన్ ప్లానింగ్ విభాగం మంజూరు చేస్తున్న అనుమతులు కేవలం జీ+2కే పరిమితమైనా, వాస్తవంలో మాత్రం జీ+4, జీ+5, జీ+6 వరకు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పాత భవనాలపై అదనపు అంతస్తులు వేసి, జీరో సెట్‌బ్యాక్‌తో రోడ్లపై పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘి స్తున్నా నోటీసులు ఇవ్వకపోవడం, నిర్మాణాలను నిలిపివేయ కపో వడం వెనుక ఏం జరుగుతుందన్న అనుమానాలు వెల్లువెత్తు తున్నాయి.అక్రమ నిర్మాణాలు ఒకటి రెండు కావు. దుండిగల్ సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఇవన్నీ అధికారుల కళ్లముందే జరుగుతున్నా చర్యలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి, అంతకుమించి అవినీతి ఆరోపణలకు తావిస్తోంది. ముడుపులు చేతులు తడపడంతో అక్రమాలు సక్రమాలుగా మారుతున్నాయన్న విమర్శలు స్థానికంగా జోరుగా వినిపిస్తున్నాయి.

## సామాన్యులకే చట్టాలు... అక్రమార్కులకు చుట్టాలు

సామాన్య ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపడితే మాత్రం మున్సిపల్ చట్టాల్లో లోపాలు చూపిస్తూ వెంటనే నోటీసులు జారీ చేసి, కూల్చివేతలు చేపడుతున్న అధికారులు, అదే చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్న పెద్ద బిల్డర్ల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.“చట్టం బలహీనులకేనా” అన్న ప్రశ్నలు దుండిగల్ సర్కిల్‌లో బలంగా వినిపిస్తున్నాయి.బల్దియా అండతో అక్రమార్కుల ఆర్భాటం “బల్ది యా పెద్ద సార్లు మా వెంటే”అన్న ధీమాతో అక్రమ నిర్మాణ దారులు రెచ్చిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. జీరో పర్మిషన్లు, జీరో సెట్‌బ్యాక్‌లతో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ ప్రజా రహదారులను ఆక్రమిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపి స్తున్నారు. ఈ అక్రమాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ప్రమాదాలు పెరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## డీసీ పట్టించుకోరు... టౌన్ ప్లానింగ్ బయటికిరాదు

బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై దుండిగల్ సర్కిల్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లి ఫిర్యాదులు చేసినా డిప్యూటీ కమిషనర్ పట్టించుకోవడంలేదని టౌన్ ప్లానింగ్ యంత్రాంగం అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. జీ+2 అనుమతులతో పలుచోట్ల, జీరో పర్మిషన్ తో పలుచోట్ల చట్టాలను ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జీరో సెట్ బ్యాక్స్, పాత భవనాలపై ఇష్టానుసారంగా అంతస్తులకు మించి నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణ దారులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వస్తున్నాయి. చట్టాలను కఠినంగా మార్చాల్సిన అధికారులే ముడుపులకు అలవాటు పడి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుండడంతో సదరు అక్రమ నిర్మాణదారులు తమ ఇష్టానుసారంగా రెచ్చిపోయి మరి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ కమిషనర్ స్పందించి ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా లేదా అని వేచి చూడాల్సిందే..

